సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023





## వుడా పార్కు అభివృద్ధికి చర్యలు

విశాఖ: వుడా పార్కు అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు.



## 'శివానందలహరి' పుస్తకావిష్కరణ

విశాఖ: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో కవి కర్రా ప్రసాదరావు అనువదించిన శివానందలహరి పుస్తకాన్ని ఆవిష్కరించారు.



## ఘనంగా సహస్ర దళార్చన

విశాఖ నగరంలోని సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు సహస్రాది తులసీదళాలతో నేత్రపర్వంగా దర్శనమిచ్చారు.

## న్యూస్‌రీల్

### రావికమతం వరకే ఆర్టీసీ సర్వీసులు

నర్సీపట్నం: తుపాను కారణంగా భారీవర్షాలకు వడ్డాది బ్రిడ్జి, బంగారుమెట్ట వద్ద మదుం దెబ్బ తిన్న కారణంగా నర్సీపట్నం డిపో బస్సులను రావికమతం వరకు నడుపుతున్నామని డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. బ్రిడ్జి, కల్వర్టు నిర్మాణ పనులను పునరుద్ధరించిన తర్వాత యథావిధిగా డిపో నుంచి చోడవరం వరకు బస్సులు నడుపుతామని, ప్రయాణికులు ఈ విషయం గమనించాలని డిపో మేనేజర్ కోరారు.

### నేడు ఎం.అలమండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దేవరాపల్లి: ఎం. అలమండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం ప్రారంభించనున్నట్లు స్థానిక సర్పంచ్ దాడి జగన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ప్రారంభోత్సవానికి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితోపాటు జిల్లా సివిల్ సప్లైస్, వ్యవసాయ తదితర శాఖల అధికారులు హాజరవుతారన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పీఏసీఎస్ ద్వారా రైతు భరోసా కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు.

### కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్‌లూ అభిజిత్ కంపెనీలో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఎస్.సత్యారావు కుటుంబీకులకు కంపెనీ తరపున రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే కన్నబాబురాజు గురువారం అందజేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, దేశంశెట్టి శంకర్‌రావు, కోన లచ్చనాయుడు, లాలం రాంబాబు, మోటూరు సంజీవి తదితరులు పాల్గొన్నారు.

### కశింకోట కూడలిలో సిగ్నల్ లైట్లు

- హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పీడీ బాలసుబ్రహ్మణ్యం



కశింకోట కూడలిని పరిశీలిస్తున్న నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పీడీ బాలసుబ్రహ్మణ్యం

కశింకోట: కశింకోట కూడలి వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కశింకోట కూడలిలో ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు జాతీయ రహదారి దాటడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ జాతీయ రహదారుల అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో పీడీ గురువారం సాయంత్రం కశింకోట కూడలిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూడలిని నాలుగు రోడ్ల జంక్షన్‌గా అభివృద్ధి చేసి ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్ లైట్లను, వెలుగు కోసం హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేస్తామన్నారు. పనులను వారం రోజుల్లోగా ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనకాపల్లి సీఐ ఎ.రవికుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### 14 నుంచి ఆర్గానిక్ మేళా

మద్దిలపాలెం(విశాఖ): ఆర్గానిక్ మేళా ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకూ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు భారత్ కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమార్ స్వామి తెలిపారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ మధ్య జరగాల్సిన ఆర్గానిక్ మేళా తుపాను కారణంగా మార్పు చేసినట్లు పేర్కొన్నారు. శివాజీపాలెంలో గల గో ఆధారిత రైతు సంఘం కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 14న ఉత్తరాంధ్ర రైతులతో సమావేశం, 15న గ్రాడ్యుయేట్ రైతుల సమావేశం, 16న ఆర్గానిక్ వ్యాపారం చేసేవారితో సమావేశం, 17న మిద్దె పంట రైతుల సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి రైతు సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్య వర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం పాల్గొన్నారు.

# ఆదుకుంటాం.. అధైర్యపడవద్దు

- తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తాం
- రైతులకు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు హామీ
- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన



జేడీ పేట వద్ద ముంపునకు గురైన వరి చేలు పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల: తుపాను వర్షాలు, వరద ముంపులో తడిచిన వరి చేలను ఎండబెట్టి, వెంటనే నూర్పిడి చేసి ఆరబెట్టి ఉంచితే రంగుమారిన ధాన్యమైనా సరే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడవద్దని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు భరోసా ఇచ్చారు. గురువారం ఆయన మండలంలో నీటముంపు ప్రాంతాలైన వీరవిల్లి, పోతనపూడి చింతలూరు, వీరనారాయణం గాదిరాయి, వీజేపురం, పొంగలిపాక, కింతలి వల్లాపురం, గిరిజన గ్రామాలైన అవురువాడ వీరనారాయణం, చిన గొరిగెడ్డ, సారాడ గ్రామాల్లో పర్యటించారు. కారు వెళ్లని ప్రదేశాలకు సైతం వాగులు వంకలు లెక్క చేయకుండా ఉదయం నుంచి సాయంకాలం వరకు బైక్‌పైన, కాలి నడకన వెళ్లి రైతుల కష్టాల అడిగి తెలుసుకున్నారు. వీరవిల్లి గ్రామంలో కూలిన రెండు ఇళ్లను పరిశీలించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. గాదిరాయి పెద్ద చెరువుకు పడ్డ గండిని పరిశీలించారు. అవురువాడ పంచాయతీ చిన గొరిగెడ్డ గ్రామానికి వెళ్లే కూడికొండమ్మ గెడ్డపై నిర్మించిన కల్వర్టు తుపానుకు కొట్టుకుపోవడంతో అక్కడికి వెళ్లి చూశారు. రాకపోకలు నిలిచిపోవడంతో అంగన్‌వాడీ చిన్నారులు, విద్యార్థులు పడుతున్న అవస్థలను అక్కడి నుండే కలెక్టర్‌కు ఫోన్‌లో తెలియజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించడంతో కల్వర్టు నిర్మాణం వెంటనే చేపట్టడానికి కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లు దెబ్బతినడంతో తుపాను నిధులతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పూర్తిస్థాయిలో నీటి ముంపులో ఉన్న వరి చేలును గుర్తించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన పర్యటనలో జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు విస్సారపు రామారావు, పద్రే రామునాయుడు, కొసిరెడ్డి కృష్ణమూర్తి, కోరుకొండచెల్లం నాయుడు, గొళ్ళవిల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఆందోళన చెందకండి**

చీడికాడ: మిచాంగ్ తుపాను వలన వరి సాగు రైతులతోపాటు ఇటుక బట్టీలు, కోళ్ల ఫారం నిర్వాహకులు నష్టపోతున్నారని, వారిని ఆదుకుంటామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చెప్పారు. గురువారం చీడికాడలో ఎంపీపీ చాంబర్‌లో ఆయన విలేకర్లతో సమావేశం నిర్వహించారు. బాధిత రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేశారన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పంటనష్టాలను అంచనా వేస్తున్నారన్నారు. పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు, మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, పార్టీ నాయకులు కురచా నారాయణమూర్తి, ధర్మిశెట్టి కొండబాబు పాల్గొన్నారు.



ముంపు గ్రామాల పరిశీలనకు బైక్‌పై వెళ్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

### వడ్డాదిలో కొత్త వంతెన నిర్మాణానికి సీఎం రూ.25 కోట్లు మంజూరు



వడ్డాదిలో దెబ్బతిన్న వంతెనను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

- దెబ్బతిన్న వంతెన, డైవర్షన్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు
- రెండు మూడు రోజుల్లో రాకపోకల పునరుద్ధరణ
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

- 8లో

# ఏలేరు కాలువకు శరవేగంగా మరమ్మతులు

- తుపానుతో పలు చోట్ల కాలువ కోత
- రిజర్వాయర్ నుంచి నీటిని ఆపినా.. నష్టం కలిగించిన గెడ్డలు
- యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టిన అధికారులు
- జీవీఎంసీకి యథావిధిగా నీటి సరఫరా
- రూ.2 కోట్ల వరకు కాలువకు నష్టం: ఈఈలు



ఏలేరు కాలువను పరిశీలిస్తున్న విస్కో ఈఈ చిరంజీవి

నాతవరం: మిచాంగ్ తుపాను కారణంగా పలు చోట్ల ఏలేరు కాలువ కోతకు గురి కాగా.. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. మహా విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకున్నారు. కోతకు గురైన కాలువను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు ఏలేశ్వరం రిజర్వాయర్, విస్కో(విశాఖ) అధికారులు సంయుక్త నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వరకు 154 కిలో మీటర్ల పొడవున కాలువ ద్వారా నీరు ప్రవహిస్తోంది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముందుగానే అధికారులు మేల్కొన్నారు. తుపానుకు నాలుగు రోజుల ముందు వరకు కాలువలోకి రోజుకు 300 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా.. తర్వాత 120 క్యూసెక్కులకు తగ్గించేశారు. ఇటీవల ఏలేరు కాలువపై కొత్తగా నిర్మించిన చానల్ ద్వారా నీటిని తాండవ, శారదా నదిలోకి విడుదల చేయడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే అనేకచోట్ల గ్రామాలు, పొలాలు నీట ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండేది. అయినప్పటికీ గెడ్డలు ఉప్పొంగి ప్రవహించడంతో పలు చోట్ల ఏలేరు కాలువలోకి బయట నీరు వచ్చేసింది. దీంతో నీటి ప్రవాహం పెరిగి పలు చోట్ల కాలువ కోతకు గురైంది. కాలువ దెబ్బతిన్న ప్రాంతాల్లో అధికారులు పనులు చేపట్టి జీవీఎంసీ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా తక్షణ చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా గురువారం మండలంలోని ఏలేరు కాలువను ఏలేశ్వరం రిజర్వాయర్, విస్కో ఇంజినీర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం, విస్కో ఈఈలు భాస్కరరావు, చిరంజీవి మాట్లాడుతూ తుపాను కారణంగా ఏలేరు కాలువ పలు చోట్ల కోతకు గురికావడంతో సుమారు రూ.2 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని చెప్పారు. కాలువను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామని, నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. విస్కో డీఈ కామేశ్వరరావు, విశ్రాంత ఎస్ఈ జగన్‌మోహన్‌రావు, జేఈ వేగి నానాజీ, ఏలేశ్వరం రిజర్వాయర్ డీఈ వినోద్, జేఈ అప్పలరాజు పాల్గొన్నారు.

# క్రషింగ్‌కు సర్వం సిద్ధం

- గోవాడ సుగర్స్‌లో బాయిలర్ పూజ
- 15న క్రషింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు



గోవాడ ఫ్యాక్టరీలో బాయిలర్‌కు పూజ చేస్తున్న ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: ఈ ఏడాది క్రషింగ్ సీజన్ ప్రారంభించేందుకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సిద్ధమైంది. ముందుగా గురువారం బాయిలర్‌కు పూజ చేశారు. ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని బాయిలర్ వెలిగించారు. ఈనెల 15 నుంచి క్రషింగ్ ప్రారంభించేలా యాజమాన్యం అన్ని పనులూ వేగవంతం చేసింది. ఈ ఏడాది 2.5 లక్షల టన్నుల చెరకు గానుగాడాలని లక్ష్యంగా పెట్టుకున్న గోవాడ ఫ్యాక్టరీ ఆ దిశగా చెరకును సేకరించేందుకు అన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటికే అగ్రిమెంట్ ఇచ్చిన రైతుల నుంచి పక్వానికి వచ్చిన చెరకు తోటలకు రస నాణ్యత పరీక్షలు జోరుగా నిర్వహిస్తున్నారు. యంత్రాలకు ఓవరాయిలింగ్ పనులు కూడా 90 శాతానికి పైబడి పూర్తి చేశారు. క్రషింగ్ ప్రారంభ సమయానికి విద్యుత్ సరఫరాతోపాటు స్టీమ్ ఎక్కువగా అవసరం కాబట్టి ముందుగా బాయిలర్‌ను ప్రారంభిస్తే ఆ సమయానికి అవసరమైన స్టీమ్ ఉత్పత్తి అయ్యి క్రషింగ్‌కు కావలసినంత అందుబాటులోకి వస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగా బాయిలర్ పనులకు పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు తిరుమలరావు, ప్రకాష్, ఫ్యాక్టరీ ఎండీ పీఏ రవి, సీఈ ప్రసాద్, సీఏఓ రామం, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.వి.వి.భాస్కరరావు పాల్గొన్నారు.

# నేవీ డే ఫైనల్ రిహార్సల్స్ నేడే

బీచ్‌రోడ్డు (విశాఖ): నేవీ డే వేడుకలకు సాగరతీరం సిద్ధమవుతోంది. శుక్రవారం నేవీ డే ఫైనల్ రిహార్సల్స్ ప్రదర్శించనున్నారు. ఇందుకు సంబంధించిన గురువారం ప్రాక్టీస్ చేశారు. ఈ నెల 2న ఫైనల్ రిహార్సల్స్, 4న నేవీ డే వేడుకలు నిర్వహించాల్సి ఉండగా.. మిచాంగ్ తుపాను కారణంగా వాయిదా వేశారు. ఈ నెల 8న ఫైనల్ రిహార్సల్స్, 10న నేవీ డే వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా తూర్పు నావికాదళం ఆర్.కె.బీచ్‌లో శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. గతంలోనే ఏర్పాట్లు పూర్తి చేయగా.. తుపాను కారణంగా అవన్నీ తొలగించారు. మళ్లీ మొదటి నుంచి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన వేదికతో పాటు గ్యాలరీలు, ఎల్ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఫైనల్ రిహార్సల్స్‌లో మెరైన్ కమాండోలు ఉగ్రవాదులపై దాడులు, స్కై డైవింగ్, హెలికాప్టర్లు, యుద్ధ నౌకలు, విమానాలతో బాంబు దాడులు, రెస్క్యూ ఆపరేషన్ తదితర విన్యాసాలు ప్రదర్శించనున్నారు. అనంతరం నేవీ బ్యాండ్ ప్రదర్శన ఉంటుంది. విన్యాసాలు తిలకించేందుకు వచ్చే ప్రజలు తినుబండారాలను తీసుకురావద్దని తూర్పు నౌకాదళం అధికారులు సూచించారు.

**తుది వేడుకలకు గవర్నర్ హాజరు**

ఆదివారం జరిగే తుది వేడుకలకు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అనంతరం తూర్పు నావికాదళాధిపతి రాజేష్ పెంధార్కర్ నేవీ హౌస్‌లో ఏర్పాటు చేసే ఎట్ హోమ్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, నౌకాదళ సిబ్బంది హాజరవుతారు.



సిద్ధం చేస్తున్న ప్రధాన వేదిక

# 11న జీవీఎంసీ కౌన్సిల్



మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ సర్వసభ్య సమావేశం(కౌన్సిల్) ఈ నెల 11న నిర్వహించనున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. ఈ నెల 6న నిర్వహించాల్సిన కౌన్సిల్ మిచాంగ్ తుపాను కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో వాయిదాపడ్డ 18 అంశాలతో పాటు మరో 27 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

–2023–24 ఏడాదిలో 3 నెలల 19 రోజులు( డిసెంబర్ 13 నుంచి మార్చి 31, 2024వరకు) కాల పరిమితికి జోన్–4 టౌన్‌కొత్తరోడ్డు వద్ద గల సీసీఎస్ ప్రాజెక్ట్ నిర్వహణ, ప్రాజెక్టు నిర్వహించేందుకు అద్దె ప్రాతిపదికన టిప్పర్లు, బ్యాక్ హోయ లోడర్ కోసం పరిపాన ఆమోదానికి, క్లాప్ ఆటోలు, ఇ–ఆటోల ద్వారా తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలు సేకరించేందుకు 655 మంది లోడర్లను రోజువారీ వేతన పద్ధతిలో రూ.450 చొప్పున 66 రోజుల కాలపరిమితికి ఆ–టెండర్స్ ద్వారా ఎంపిక చేయబడిన కాంట్రాక్ట్ ఏజెన్సీ నుంచి కార్మికులను సరఫరా చేసేందుకు, సీఎం ఇ–బస్ సేవా పథకం జీవీఎంసీ హ్యాండ్‌హోల్డింగ్ చేయడంపై చేపట్టే ప్రతిపాదన పరిపాలన అనుమతికి, మధురవాడ, పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక క్లస్టర్లు, గృహ అవసరాలకు 66 ఎంఎల్‌డి నీటి రఫరా, పంపిణీకి, ముడసర్లోవలో నీటి శుద్ధి కర్మాగారం నిర్మాణంతో పాటు కేబీఆర్ నుంచి ట్రాన్స్‌మిషన్ మెయిన్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు షరతులతో కూడిన విస్కో ప్రాజెక్ట్ ప్రతిపాదనకు సభ్యుల ముందుకు చర్చకు రానుంది.

### పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారిమళ్లింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): ఆయా సెక్షన్‌ల పరిధిలో జరుగుతున్న భద్రతా, ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ నెల 8వ తేదీన న్యూ జల్పాయ్‌గురి–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22612) ఎక్స్‌ప్రెస్, న్యూటిన్‌సుకియా – కేఎస్ఆర్ బెంగళూరు (22502) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 9వ తేదీన అగర్తలా–ఎస్ఎంవీ బెంగళూరు (12504) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయినట్లు పేర్కొన్నారు.

# మార్గశిర మాసోత్సవాలకు పక్కా ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న విశాఖ జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

దాబాగార్డెన్స్ (విశాఖ): కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 13 నుంచి జనవరి 11వరకు నిర్వహించనున్న మార్గశిర మాసోత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, ఉత్సవ సమన్వయ కమిటీ చైర్మన్ కె.ఎస్.విశ్వనాథన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, వైద్య శిబిరాలు, విద్యుత్ తదితర సదుపాయాలపై సంబంధిత శాఖాధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. దేవాలయం వద్ద అగ్నిమాపక శకటంతో పాటు సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖాధికారిని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వోని ఆదేశించారు.

ఆలయ పరిసర ప్రాంతాల్లో మత్తు పానీయాల విక్రయాలు, వినియోగం లేకుండా సంచార బృందాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక నిఘా గస్తీ ఏర్పాటు చేయాలని అబ్కారి శాఖాధికారులను కో రారు. దేవాలయం పరిసరాల్లో ప్లాస్టిక్ వినియో గాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ముఖ్యమైన గు రువారాల్లో అదనపు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. నెల రోజులు విశిష్ట, ప్రత్యేక, ఉచిత దర్శనాల కోసం తగిన ఏర్పాట్లతో పాటు షామియానాలు, విద్యుత్ అలంకరణ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా మార్గశిర మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

# స్వచ్ఛమైన ఓటర్ల జాబితాయే మన లక్ష్యం

- ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు యువరాజ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న యువరాజ్, పక్కన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఎటువంటి పొరపాట్లకు అవకాశమివ్వకుండా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు డా.ఎస్.యువరాజ్ కోరారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు వెన్నెముక అయితే.. ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితాయే మూలమని చెప్పారు. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతీ ఓటరును కచ్చితంగా జాబితాలో నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా యువ ఓటర్లను గుర్తించి.. వారిని జాబితాలో చేర్చాలన్నారు. ఓటు నమోదు లేదా తొలగింపునకు డాక్యుమెంట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితాలో జనాభా పరంగా, స్త్రీ, పురుష పరంగా తగిన నిష్పత్తిలో ఉండాలన్నారు. తేడా గమనించినప్పుడు క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. వలసలు వెళ్లిన వారి విషయంలో జాగ్రత్తగా విచారించి నమోదు చేయాలన్నారు. పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి, చోడవరం మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయనకు వివరించారు. ఓటర్ల జాబితా నమోదు, తనిఖీ చేసే సమయాల్లో అధికారులు సానుకూల దృక్పథం, పూర్తి నమ్మకంతో వ్యవహరించాలన్నారు. అనుభవజ్ఞులు, పై అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు.

**రాజకీయ పార్టీలు సహకరించాలి**

అర్హత గల ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్చేందుకు రాజకీయ పార్టీలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు డాక్టర్ ఎస్.యువరాజ్ కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకసారి తొలగించిన ఓట్లు.. మళ్లీ జాబితాలో కనిపిస్తున్నాయని టీడీపీ నాయకులు ప్రస్తావించగా.. ఈ విషయంలో తప్పు జరిగితే బీఎల్‌వోలపై చర్యలు తప్పవన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలైనప్పటి నుంచి రాజకీయ పార్టీలు స్పందించి ఉన్నట్లయితే వీలైనంత వేగంగా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారయ్యేదన్నారు. జిల్లాలో అందిన ఫిర్యాదులపై అధికారులు మార్పులు, చేర్పులు చేశారని నాయకులకు వివరించారు. డీఆర్వో దయానిధి, ఈఆర్వోలైన ఆర్డీవోలు హెచ్.వి.జయరాం, ఎ.చిన్ని కృష్ణ, ఎస్‌డీసీలు డి.ప్రమీలాగాంధీ, కె.వి.రామలక్ష్మి, కె.మనోరమ, టి.ఈ.ఎం.రాజు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, రవికుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.రామకృష్ణ(వైఎస్సార్ సీపీ), బుద్ధ నాగ జగదీశ్వరరావు(టీడీపీ), సిహెచ్ నాగేశ్వరరావు (బీజేపీ), డి.సంతోష్ (కాంగ్రెస్), ఎ.రాజు(సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

### దోషరహితంగా ఓటరు నమోదు

యలమంచిలి/కశింకోట: తప్పులు లేని ఓటరు జాబితాపై బీఎల్‌వోలు దృష్టి సారించాలని ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు డాక్టర్ ఎస్.యువరాజ్ అన్నారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలసి యలమంచిలి మండలం లక్కవరం, కశింకోట బాలికల ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల తొలగింపులు, చేర్పుల్లో తప్పులు దొర్లకుండా జాబితా తయారు చేయాలన్నారు. పెళ్లి చేసుకొని వేరే ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లను గుర్తించాలని, వలస వెళ్లిన వారిని గుర్తించి వారి వివరాలు క్షుణ్ణంగా పరిశీలన చేసి నిబంధనలకు అనుగుణంగా ఓటరు జాబితాలో వివరాలు పొందుపరచాలన్నారు. మృతుల ఓట్ల తొలగింపునకు నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చారో లేదో పరిశీలించారు. ఈనెల 9లోగా ఓటర్ల జాబితాలో తప్పులుంటే సవరించాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు అందజేశారు. కశింకోట ఇన్‌చార్జి తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు, బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



కశింకోటలో ప్రత్యేక ఓటర్ల నమోదును కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి పరిశీలించిన ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు యువరాజ్

## కృష్ణంగా

### వైభవంగా పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కొమ్మాది (విశాఖ): రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో తొలి సారిగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు నిర్వహించనున్న ఈ పవిత్రోత్సవాల్లో మొదటి రోజు అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం పవిత్ర ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు.

### ప్రజలకు అండగా నిలవాలి

మాడుగుల: ప్రజలు కష్టకాలంలో ఉన్నపుడు మండల స్థాయి అధికారులు స్పందించకపోతే ఎలా అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు వ్యాఖ్యానించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ ముంపు గ్రామాల్లో తిరిగి బాధితుల కష్టాలు తెలుసుకోవడం కనీస బాధ్యత అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రజలకు అండగా అధికారులు ఉండి ప్రజలకు సేవలందించి.. అటు ప్రభుత్వానికి ఇటు మీకు మంచి పేరు తీసుకురావాలని హితవు పలికారు.





## వడ్డాదిలో కొత్త వంతెనకు
# సీఎం రూ.25 కోట్లు మంజూరు



కన్నంపాలెం వద్ద నీట మునిగిన వరి పంటను ధర్మశ్రీకి చూపిస్తున్న బాధిత రైతులు



చోడవరం వద్ద పెద్దపెద్ద గోతులు పడిన బీఎన్ రోడ్డు పరిశీలనలో ధర్మశ్రీ, ఆర్అండ్‌బీ అధికారులు

బుచ్చెయ్యపేట/చోడవరం: మిచాంగ్ తుపానుతో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, రెండు మూడు రోజుల్లో ప్రజల రాకపోకలను పునరుద్ధరిస్తామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. తుపాను వల్ల వడ్డాదిలో నీటి ముంపునకు గురైన డైవర్షన్ రోడ్డు, దెబ్బతిన్న వంతెన, చోడవరంలోని జన్నవరం, పీఎస్ పేట, చాకిపల్లి ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వడ్డాదిలో కొత్త వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 కోట్లు మంజూరుకు అమోదం తెలిపారన్నారు. తాత్కాలిక నిర్మాణ, మరమ్మతు పనులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామన్నారు. బుచ్చెయ్యపేటలో సుమారు 6 వేలు, చోడవరంలో దాదాపు 4 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. అన్ని గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ, ఆర్బీకే సిబ్బంది ద్వారా పంట నష్టపోయిన రైతులను గుర్తించి, ప్రభుత్వం ద్వారా పరిహారం అందిస్తామన్నారు. సీఎం జగన్ ఎకరాకు రూ.10 వేలు నష్టపరిహారం ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. కోతకు గురయ్యే నదీ గట్లను పటిష్టపరచాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వర్షాలకు పూర్తిగా దెబ్బతిని, పెద్దపెద్ద గోతులు పడిన బీఎన్ రోడ్డులో చోడవరం, గాంధీగ్రామాల పరిధిలో ధర్మశ్రీ, అధికారుల బృందం పర్యటించింది. వర్షాలు తగ్గిన వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ధర్మశ్రీ ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, డీపీవో శిరీషారాణి, ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ అరుణ్ చంద్ర, తిరుమలబాబు, ఎంపీడీవో సువర్ణరాజు, శ్యామ్‌సుందర్, ఈవో లవరాజు, వీఆర్వో సుధాకర్ తదితర్లు పాల్గొన్నారు.



పీఎస్ పేట వద్ద కోతకు గురైన పెద్దేరు గట్టును పరిశీలిస్తున్న ధర్మశ్రీ, ఆర్డీవో, ఇరిగేషన్ అధికారులు

## బీఎన్ రోడ్డులో కూలిన మదుం



లోపూడి, బంగారుమెట్ట గ్రామాల మధ్యన కూలిన మదుం



బీఎన్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం–నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో మరో మదుం కూలిపోయింది. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు జోరుగా ప్రవహిస్తున్నాయి. నీటి ప్రవాహంతో లోపూడి పామాయిల్ ఫ్యాక్టరీ, డాల్ఫిన్ పాల కేంద్రం మధ్యన ఉన్న మదుం గురువారం మధ్యాహ్నం కూలిపోయింది. దీంతో బీఎన్ రోడ్డులో తిరిగే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికే వడ్డాది డైవర్షన్ రోడ్డు నీటిలో మునిగిపోగా, వంతెన దెబ్బతినడంతో రెండు రోజులుగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాడేరు, విశాఖ, అనకాపల్లి, మాడుగుల ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బంగారుమెట్ట మీదుగా వీరవల్లికి రాకపోకలు సాగించేవారు. ఇపుడు లోపూడి వద్ద మదుం కూలిపోవడంతో రావికమతం, వడ్డాది మధ్య పూర్తిగా రాకపోకలు స్తంభించాయి. పలు గ్రామాలకు వెళ్లే వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంఘటన స్థలాన్ని జెడ్పీటీసీ దొండా రాంబాబు, కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎస్.రమేష్, ఎస్ఐ కుమారస్వామి తదితరులు పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా కూలిన మదుం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## క్రీడా ఆణిముత్యాలను వెలికి తీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు స్పష్టం



తారువలో ఆడుదాం ఆంధ్రా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ప్రతిభావంతులైన క్రీడా ఆణిముత్యాలను వెలికితీసి, వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా'కార్యక్రమానికి రూపకల్పన చేశారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి మండలం తారువలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం 'ఆడుదాం ఆంధ్రా'గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో మొదటిసారిగా రాష్ట్ర వ్యాప్త క్రీడా కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే టోర్నమెంట్‌లో రాష్ట్రానికి చెందిన 15 ఏళ్ల వయసు దాటిన పురుషులు, మహిళలు పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపే క్రీడాకారులకు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బహుమతులను అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆన్‌లైన్ వెబ్‌సైట్, సమీప సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్‌వీ రమణ, వీఆర్‌వో పోతల శంకరరావు, చల్లా నాయుడు, కె.ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ కార్తీక దీపోత్సవం రద్దు

ఎంవీపీకాలనీ (విశాఖ): ఆర్కేబీచ్ వేదికగా ఈ నెల 11న నిర్వహించ తలపెట్టిన టీటీడీ కార్తీక దీపోత్సవం రద్దయింది. ఈ మేరకు టీటీడీ అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకున్నట్లు సాగర తీర కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- యలమంచిలి పర్యటనలో జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

యలమంచిలి: తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. గురువారం ఆయన యలమంచిలి మండలంలో కట్టుపాలెం, కొత్తపాలెం, పులపర్తి, రామారాయుడుపాలెం, తెరువుపల్లి, బయ్యవరం గ్రామాల్లో వరద ముంపునకు గురైన వరి పొలాలను వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించారు. దెబ్బతిన్న వరి పొలాలను మండల స్థాయిలో అంచనావేసి నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పంట పొలంలో నీరు తొలగించేందుకు రైతులు చేపట్టాలన్నారు. నేలకొరిగిన వరి పంట మొలక రాకుండా ఉప్పు ద్రావణాన్ని తగు మోతాదులో పిచికారీ చేయాలన్నారు. పడిపోయిన వరి దుబ్బులను నిలబెట్టేందుకు రైతులకు సూచనలిచ్చారు. మండలంలో ఇప్పటి వరకు 312 హెక్టార్లలో వరి పంట నీట మునిగిందని, 832 హెక్టార్లలో పడిపోయిన పంటకు ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజినల్ వ్యవసాయాధికారి రవి ప్రకాష్, మండల వ్యవసాయాధికారి మోహనరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## యువతరంతోనే ఉత్తమ సమాజం



సమావేశంలో సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్

దొండపర్తి (విశాఖ): విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా జ్ఞాన సముపార్జనపై దృష్టి పెట్టాలని, యువతరంతోనే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పేర్కొన్నారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో మహిళా పోలీసులు(వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి), విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి విద్యతో పాటు మంచి నడవడిక పట్ల యువతరంలో చైతన్యం తీసుకురావాలని, అందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. వార్డుల్లో గల సచివాలయాలు, పాఠశాలలు, కాలేజీల్లో పలు విషయాలపై అవగాహన కలిగిస్తూ వాల్ పోస్టర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. మహిళలకు సేఫ్టీపై అవగాహన కలిగించాలని, డీఏస్ హెల్ప్ లైన్ అవశ్యకతను పోస్టర్ల ద్వారా తెలియజేయాలన్నారు. మహిళా పోలీసులకు వార్డులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, మహిళలపై, పిల్లలపై ఎటువంటి దాడులు, మోసాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎల్లవేళలా సంబంధిత పోలీస్ వాట్సాప్ గ్రూప్‌లో యాక్టివ్‌గా ఉంటూ ముఖ్య సమాచారాలను పంచుకోవాలని, అవసరం మేరకు ఉన్నతాధికారులతో కూడా నేరుగా తమ సమస్యను పంచుకోవచ్చన్నారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినా డయల్ 100/112కు గానీ, వాట్సాప్ నెంబర్ 9493336633కు గాని లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో డీఈఓ ఎల్.చంద్ర కళ, దిశా ఏసీపీ వివేకానంద, విద్యా శాఖ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాడేరు డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు



ఐఎస్‌వో ధ్రువపత్రాన్ని చూపిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎస్‌ఐవో గుర్తింపు లభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనము చిట్టిబ్బాయి తెలిపారు. ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎనర్జీ సేవింగ్ ప్రాక్టీసెస్, ప్రొవైడింగ్ ఎడ్యుకేషనల్ సరీ్వసెస్, ఇంప్లిమెంటేషన్ ఆక్టివిటీస్ గుర్తింపులను కళాశాల సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఐఎస్‌వో సిబ్బంది గురువారం విశాఖలో అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టిఎస్.రసూల్, సీనియర్ అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు అభినందించారు.

## కాఫీని గిట్టుబాటు ధరకు విక్రయించండి

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



కాఫీ రైతులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్



తడిచిన వరి పనలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

హుకుంపేట: గిరిజన రైతులు కాఫీ ఫలసాయాన్ని గిట్టుబాటు ధరకు విక్రయించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. గురువారం మండలంలోని లోచలిపుట్టు గ్రామాన్ని ఆయన సందర్శించారు. గిరిజన రైతులతో మాట్లాడారు. తుపాను పంట నష్టం వివరాలను పీవో తెలుసుకున్నారు. పార్చిమెంటు కాఫీ కిలోకు రూ.280 చొప్పున జీసీసీ ధర చెల్లిస్తోందన్నారు.

చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా కాఫీ పండ్లు కిలో రూ.43లకు కొనుగోలు చేస్తున్నారని వారు వివరించారు. జీసీసీ చెల్లించే ధరకన్నా తక్కువకు దళారులకు విక్రయించకూడదని సూచించారు. మంచి ధర వచ్చే వరకు పార్చిమెంటును నిల్వ చేసి ఉంచాలన్నారు. ఎకరానికి సుమారు రూ.60వేల ఆదాయం రావాలని అన్నారు. మిరియాలు కిలో రూ.500కు పైబడి విక్రయించాలని పేర్కొన్నారు. కాఫీ విక్రయాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. తుపాను వర్షాలకు ముంపునకు గురైన వరి పంటను పరిశీలించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన
# విద్యుత్ పునరుద్ధరణ

- ఈపీడీసీఎల్ సేవలను ప్రశంసించిన స్పెషల్ సీఎస్
- తుపాను కారణంగా విశాఖ సర్కిల్‌కి రూ.1.46 కోట్ల నష్టం

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను సమయంలో ఈపీడీసీఎల్ సేవలు అద్భుతంగా ఉన్నాయని విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ అభినందించారు. సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడితో పాటు విద్యుత్ ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై చర్చించారు. తుపాను నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల పరిధిలోని 7 విద్యుత్ డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో విద్యుత్ అంతరాయాల నిరంతర పర్యవేక్షణ నిమిత్తం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు. తుపాను ప్రభావంతో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 21 నెం. 33/11కేవీ ఉప కేంద్రాలు మరమ్మతులకు గురవ్వగా త్వరితగతిన బాగు చేసి సరఫరా పునరుద్ధరించినట్లు సర్కిల్ ఎస్ఈ మహేంద్రనాథ్ వివరించారు. చెట్లు విరిగిపడి 11కేవీ స్తంభాలు 76, ఎల్‌టీ స్తంభాలు 203 విరిగిపోగా వాటిని 12 గంటల వ్యవధిలో మార్చామన్నారు. ఈ తుపాను వల్ల 16 మండలాల్లో 1,030 గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. మొత్తంగా మిచాంగ్ కారణంగా జిల్లాలో విద్యుత్ శాఖకు సుమారు రూ.1.46 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులకు ఎస్.మహేంద్రనాథ్ వివరించారు. మూడు రోజుల పాటు 1,76,384 మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను అధికారులు, విద్యుత్ సిబ్బంది జోరు వానలో కూడా 12 గంటల వ్యవధిలోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంపై సీఎండీ పృథ్వీతేజ్ అభినందించారు.

## బంగారం చోరీ కేసులో ఇద్దరికి జైలు

విశాఖ లీగల్: ఓ మహిళ వద్ద బంగారం చోరీ చేసిన కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు, రూ.1000 జరిమానా విధిస్తూ నగరంలోని 12వ అదనపు జిల్లాకు న్యాయమూర్తి పి.గోవర్ధన్ గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వడ్లపాటి దేవానందరావు అందించిన వివరాలివీ.. మొదటి నిందితుడు ప్రసాద్ పెద్దపల్లె కాలనీలో, రెండవ నిందితుడు పెంటయ్య(22) ఎర్రవరంలో నివాసం ఉండే వారు. 2013 మే 18న యలమంచిలి పరిధి మరిబండ గ్రామ సమీపంలో పోలవరం కాలువ దగ్గర ఓ మహిళ మృతదేహాన్ని కనుగొన్నారు. అప్పటి వీఆర్వో ఈ విషయాన్ని యలమంచిలి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. మహిళపై లైంగిక దాడి చేసి, చంపినట్లు గుర్తించారు. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు మాయమైనట్లు వారి విచారణలో తేలింది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితులుగా ప్రసాద్, పెంటయ్యగా గుర్తించారు. మృతదేహం తూర్పుగోదావరి జిల్లా తునిలోని కృష్ణకాలనీకి చెందిన 43 ఏళ్ల వనం వెంకటలక్ష్మిగా తేలింది. నిందితుల నుంచి బంగారం స్వాధీనం చేసుకుని.. వారిపై ఐపీసీ 302, 376, 379, 201 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో కేవలం బంగారం మాత్రమే వారు దొంగలించినట్లు నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

# కెమిస్ట్రీ కుదిరింది.. వేడుక అదిరింది

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థినుల డ్యాన్సులు





ఏయూక్యాంపస్: కొత్తగా కళాశాలలో అడుగిడిన విద్యార్థులకు అపూర్వ స్వాగతం పలికారు సీనియర్ విద్యార్థులు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ మందిరం ఇందుకు వేదికై ంది. ఏయూ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. యువతులు చీరకట్టులో తళుక్కుమన్నారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. శాస్త్రీయ, వెస్ట్రన్, జానపద నృత్యాలతో హోరెత్తించారు. కొంత మంది పాటలు ఆలపించి అలరించారు. వేదిక బయట ఏర్పాటు చేసిన ఫొటో స్పాట్ వద్ద ఫొటోలు తీసుకుని పదిలపరచుకున్నారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆచార్య పి.శ్యామల, ఆచార్య వి.సిద్ధయ్య, ఆచార్య కె.బసవయ్య తదితరులు మాట్లాడారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ పొందే దిశగా కృషి చేయాలని, లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కష్టపడాలని సూచించారు.

## ఘాట్‌రోడ్డు క్లియర్

- కొండ చరియలు, చెట్ల తొలగింపు పూర్తి
- శరవేగంగా చేపట్టిన ఆర్అండ్‌బీ అధికారులు

సాక్షి,పాడేరు: భారీ వర్షాలకు పాడేరు ఘాట్‌లో పలుచోట్ల విరిగిపడిన కొండచరియలు, చెట్ల తొలగింపు పనులు గురువారం రాత్రితో ముగిశాయి. బుధవారం రాత్రంతా ఘాట్‌లో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. గురువారం వాహనాలు వెళ్లేందుకు దారినిస్తూనే కొండచరియలు, మట్టిదిబ్బలు, చెట్లను తొలగింపు పనులను ఈఈ బాలసుందర బాబు పర్యవేక్షణలో ఆర్అండ్‌బీశాఖ అధికారులు చేపట్టారు.

యంత్రాలతో కొండచరియలను తొలగించారు. రాత్రికి పనులన్నీ పూర్తవడంతో ఘాట్ రోడ్డు క్లియర్ అయింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



శరభవరంలో అరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

దేవీపట్నం: ఏజెన్సీలో ప్రతీ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అన్నారు. మండలంలోని శరభవరం గ్రామంలో గురువారం ధాన్యం కల్లాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బయోమెట్రిక్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్నిఎంపిక చేసిన మిల్లులకు జియోట్రాకింగ్ ద్వారా ద్వారా వాహనాల్లో తరలిస్తామన్నారు. గత ఏడాది జిల్లాలో 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది సుమారు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసిన పరికరాలు, గోనె సంచుల వివరాలను వ్యవసాయ అధికారుల నుంచి తెలుసుకున్నారు. తుపాను కారణంగా జరిగిన పంట నష్టం వివరాలను ఆయన సేకరించారు. పీహెచ్‌వో సీహెచ్ కేవీ చౌదరి పాల్గొన్నారు.

# ఇవిగో ప్రగతి బాటలు...




కశింకోట : వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లకు మరమ్మతులు చేయలేదని, పునరుద్ధరించలేదనే విమర్శలు వాస్తవం కాదనడానికి ఈ రోడ్లే నిదర్శనంగా నిలువనున్నాయి. కశింకోట మండలంలో మూడు చోట్ల రోడ్లను రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.5.25 కోట్లు ఖర్చు చేసి మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించారు. రోడ్లు గండ్లు పడి రాకపోకలకు ప్రజలు అష్టకష్టాలను ఎదుర్కొనే వారు. ఈ నేపథ్యంలో గండ్లు పూడ్చి రోడ్లను తారు వేసి పునరుద్ధరించారు. దీంతో రాకపోకలు సాఫీగా సాగిపోతుండడంతో వాహన చోదకులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కశింకోట-వెదురుపర్తి గ్రామాల మధ్య సుమారు 5 కిలోమీటర్ల పొడవున్న రోడ్డు, భవనాల శాఖ రహదారి దెబ్బతిని గోతుల మయంగా మారింది. వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే వారు. అధికారులు, గత పాలకుల దృష్టికి తీసుకు వచ్చినా ప్రయోజనం లేని పరిస్థితి.


పునరుద్ధరించిన వెదురుపర్తి రోడ్డు

ఈ నేపథ్యంలో ఈ రోడ్డుకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిధులు మంజూరు చేయించి సుమారు రూ.కోటి 65 లక్షలతో గండ్లు పూడ్చి ఏడాది క్రితం పునరుద్ధరించారు. దీంతో ఇబ్బంది తొలగడంతో వాహన చోదకులు, ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేసున్నారు. మంత్రి చొరవతో బయ్యవరం నుంచి కొండ చుట్టూ 7 కిలోమీటర్ల పొడవున గోతులతో నిండి అధ్వానంగా ఉన్న


పునరుద్ధరించి మరమ్మతులు చేసిన నరసింగబిల్లి-కొండకర్ల వెళ్లే రోడ్డు

రోడ్డును రూ.2 కోట్లతో మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించారు. నరసింగబిల్లి నుంచి కొండకర్ల వైపు వెళ్లే రోడ్డును సుమారు రూ.కోటి 60 లక్షలతో గోతులు పూడ్చి తారు వేసి పునరుద్ధరించారు. దీంతో రోడ్లు బాగు పడ్డాయి. ప్రజల కష్టాలు తీరాయి. రోడ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడం పట్ల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.




### ఐదు నిమిషాల్లోనే గమ్యం



కశింకోట మండలంలోని వెదురుపర్తికి చెందిన యువకుడు ఎస్.సాయి.వెదురుపర్తి నుంచి కశింకోటకు రావడానికి రోడ్డు గోతుల మయంగా మారి అధ్వానంగా ఉండడంతో ఎక్కువ సమయం పట్టేది. ఐదు కిలోమీటర్ల రోడ్డు దాటానికి 50 నిమిషాలు సమయం పట్టేది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించడంతో ఇప్పుడు 5 నిమిషాల్లోనే వేగంగా చేరుకోగలుగుతున్నాం. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించినందుకు ఎంతో ఆనందంగా ఉంది.

– సాయి, వెదురుపర్తి గ్రామం

### సజావుగా రాకపోకలు



ఐదేళ్లగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. వెదురుపర్తి రోడ్డు గోతుల మయంగా మారి ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగేది. ఆటోలు తరచుగా మరమ్మతులకు గురయ్యేవి. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు రోడ్డుకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించడంతో రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. ఎంతో ఆనందంగా ఉంది.

–దాసరి రాము, ఆటో డ్రైవర్

## క్లుప్తంగా

### వేంకటేశునికి ముఖమల్ క్లాత్ అందజేత


ఆలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మికి ముఖమల్ క్లాత్‌ను అందిస్తున్న నాగార్జున, లావణ్య దంపతులు

అనకాపల్లిటౌన్: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి దేవాలయం గర్భగుడిలో వేంకటేశ్వర స్వామికి వ్యాపారవేత్త గ్రంధి నాగార్జున, లావణ్య దంపతులు రూ.20వేలు విలువచేసే ముఖమల్ క్లాత్‌ను ఆలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి, గోవింద దంపతులకు గురువారం అందించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ స్వామివారి గర్భాలయంలో విగ్రహం వెనుక భాగాన నిత్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజసులోచన, కమిటీ సభ్యురాలు శ్రీధరాల కోమలి, అలయ అర్చకులు పులఖండం గిరిబాబు, విజయ్ బాబు, ప్రసాద్, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

### 11న మహా మృత్యుంజయ హోమం

అనకాపల్లిటౌన్: బట్లపూడి పంచాయతీ రాయుడుపేట సోహం ఆశ్రమంలో ఈనెల 11వ తేదీన ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకూ మహా మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్టు ఆశ్రమం నిర్వాహకులు కాండ్రేగుల రవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీకమాసం నాలుగో సోమవారం పురస్కరించుకుని శివలింగానికి ప్రత్యేక పూజలు, హోమాలు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

### కేంద్ర, రాష్ట్ర పథకాలపై అవగాహన


పాపయ్యసంతపాలెంలో వికసిత భారత్ సంకల్పయాత్రలో ఈవోఆర్డీ కె.ధర్మారావు

అనకాపల్లిటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని ఈవోఆర్డీ కె.ధర్మారావు అన్నారు. మండలంలో పాపయ్యసంతపాలెం, దిబ్బపాలెం గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు ముందుగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను డిస్‌ప్లేలో చూపించారు. ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, పాల్గొన్నారు.

### రేపు మండల సర్వసభ్య సమావేశం

కశింకోట : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరగనుందని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు,సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| ఆదికేశవ | : రాజా |
| కాలింగ్ సహస్ర | : సత్యనారాయణస్క్రీన్-1 |
| బ్రీత్(వైద్యో నారాయణో హరి)మార్నింగ్ షో | |
| విక్రమ్ రాథోడ్ | : సత్యనారాయణస్క్రీన్-2 |
| ఆనిమల్ | : షిర్డిసాయి |
| కోటబొమ్మాళి | : పర్తిసాయి |
| ------- | : వెంకటేశ్వర |
| సౌండ్ పార్టీ | : శ్రీసత్య |
| మంగళవారం | : రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–9 యూనిట్లు, బీ నెగిటివ్–2 యూనిట్లు, ఓ పాజిటివ్–17 యూనిట్లు, ఏబీ పాజిటివ్–4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

## అంగన్‌వాడీ కార్మికుల సమ్మె వాయిదా


విలేకరులతో మాట్లాడుతున్న మజ్జి నాగశేషు

అనకాపల్లిటౌన్: అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 8న తలపెట్టిన కార్మికుల సమ్మెను తుపాన్ కారణంగా ఈనెల 12వ తేదీకి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మార్పుచేయడం జరిగిందని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులు తలపెట్టిన సమ్మెకు రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రితో చర్చించి ఈనెల 11వ తేదీలోపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్రంలో అంగన్‌వాడీల కన్నా అదనంగా వెయ్యి రూపాయలు ప్రభుత్వం ఇచ్చే విధంగా మంత్రితో మాట్లాడడం జరుగుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఉమా, నారాయణమ్మ, ఉషాజ్యోతి పాల్గొన్నారు.

## అర్హతే కొలమానంగా పథకాలు


లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పి.గోవింద్

అనకాపల్లిటౌన్ : అర్హతే కొలమానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ అన్నారు. సంపతిపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు రూ.23.50 కోట్ల సంక్షేమ లబ్ధి వివరాలతో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. ప్రధాన కూడలి వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడే పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టి, మరుసటి రోజు గత పాలన, నేటి పాలన బ్రోచర్‌ను ప్రజలకు అందజేశారు. మండల పరిషత్ ఈవోఆర్డీ కె.ధర్మారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.శోభ, సర్పంచ్ అరవింద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాము, నంబారి రమణ, కృష్ణారావు, దాకారపు గోవింద్, బోర ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

## శారదానది ఉధృతి తగ్గుముఖం


కశింకోట వద్ద శారదానది ప్రవాహ ఉధృతి


బయ్యవరంలో వర్షాలకు కూలిన చర్చి ముందు భాగం

కశింకోట : కశింకోటలో శారదానది నీటి మట్టం గురువారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. దీంతో స్థానికులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. నదిపై గవరపేటలో రెండో రోజు కూడా దోనె ప్రయాణాలు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. వర్షాలు తెరిపినివ్వడంతో నీటి మునిగిన వరి పంట కూడా క్రమేపి తెరుకుంటోంది. అయితే పంట నష్ట పరిస్థితిపై స్పష్టత రావడానికి కొంత సమయం పడుతుందని మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న పేర్కొన్నారు. నేల కొరిగిన వరి పంటను నిలుపుకోవాలని రైతులకు సూచించారు. ఇదిలా ఉండగా బయ్యవరంలో సెవెంత్ డే ఎడ్వంటిస్టు చర్చి ముందు భాగం వర్షాల నేపథ్యంలో కూలిపోయిందని పాస్టర్ బి. శ్యాంబాబు తెలిపారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేనందున ఎవరికీ ఎటువంటి హాని జరగలేదన్నారు.

## 'ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి'



న్యాయస్థానం వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లిటౌన్: ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం న్యాయస్థానం వద్ద ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలక్ష్మణ్ మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలు జరిగితే సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే సమస్య ఉంటుందన్నారు. సివిల్ కోర్టు పరిధి నుంచి రెవెన్యూ పరిధిలోకి భూ వివాదాలకు సంబంధించి చట్టాన్ని తేవడంతో ప్రజలు మధ్య వివాదాలు పెరిగిపోతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పిళ్లా హరశ్రీనివాస్, కుమార్, కనిశెట్టి సురేష్‌బాబు, బాలగంగాధర్ తిలక్, పీఎస్.పట్నాయక్, సుధాకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కైట్స్‌లో సాయుధ దళాల పతాక దినోత్సవం


విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): కైట్స్, భవానీ విద్యానికేతన్‌లలో గురువారం సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర సైనిక్ సెల్ కో కన్వీనర్ హనుమంతరావు పతాక దినోత్సవ ప్రాధాన్యాన్ని వివరించారు. జెండాలు, కార్డులను ప్రజలు కొనుగోలు చేయడం ద్వారా వచ్చే నిధిని రక్షణ సిబ్బంది సంక్షేమానికి ఉపయోగిస్తారని తెలిపారు.

### శభాష్ వలంటీర్


పైడితల్లికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

మునగపాక : పాటిపల్లి గొల్లపేటకు చెందిన వలంటీర్ చొప్పా పడమటమ్మ తనకు కేటాయించిన 50 గృహాల ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ వస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన కోన పైడితల్లి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ అచ్యుతాపురంలో బంధువుల ఇంటివద్ద ఉంటున్నారు. అక్కడకు వెళ్లి డిసెంబర్ నెలకు సంబంధించిన పింఛన్ రూ.2750 నగదును వలంటీర్ పడమటమ్మ అందజేశారు. దీంతో స్థానికులు వలంటీర్‌ను అభినందించారు.

## నీట మునిగిన పొలాల్లో సహాయక చర్యలు


వెంకుపాలెంలో రహదారిపై వర్షపు నీటిని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి పి.రంగారావు


బొజ్జన్నకొండ సమీపంలో బ్రిడ్జికి అడ్డంగా ఉన్న గుర్రపు గెడ్డను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి


కొప్పాక బ్రిడ్జివద్ద వర్షపునీరు

అనకాపల్లిటౌన్ : వ్యవసాయ, నీటిపారుదల, రెవెన్యూశాఖ అధికారులు పొలాలు వద్ద రైతుల సహాయంలో వరిపొలంలో ఉన్న నీటిని తొలగింపజేస్తున్నారు. తుపాన్ ప్రభావం తగ్గడంలో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి మాట్లాడుతూ 22 గ్రామాల్లో 476 హెక్టార్లలో వరి పంట నీటమునిగిందని, 485 హెక్టార్లలో వరి నేల కొరిగిందని చెప్పారు.

మండలంలో శంకరం, తుమ్మపాల పంచాయితీ పరిధిలో నీటమునిగిన వరిపొలాల్లో నీటిని తొలగించారు. బొజ్జన్నకొండ ఏలేరు కాలువలో బ్రిడ్జి వద్ద తూముకు గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు అడ్డంగా ఉండిపోవడంతో తొలగించి, నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన నార్త్–2 వరి పొలంలో నీటిని నిల్వలేకుండా కాలువల ద్వారా పంపించామన్నారు. వెంకుపాలెం గ్రామానికి గెడ్డపై నుంచి వచ్చిన వర్షపు నీటి వల్ల గ్రామంలో నీరు రహదారులపై పారుతుందని, శారదానది ఉధృతంగా పారడంతో నీటిని ప్రత్యేక మార్గం ద్వారా పంపించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పర్యటనలో నీటిపారుదలశాఖ డీఈ హనుమంతరావు, గ్రామాల సర్పంచ్‌లు రాపేటి నాగేశ్వరరావు, పెంటయ్యానాయుడు, రెవెన్యూనాయుడు, పసుపులేటి లక్ష్మీరామకృష్ణ పాల్గొన్నారు.

కొప్పాక ఏలేరుకాలువ బ్రిడ్జి సమస్య....

జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జిపై నుంచి వర్షపు నీరు రావడంతో గాజువాక నుంచి అనకాపల్లి వాహనదారులు, విలీన గ్రామాల ప్రజలు అనకాపల్లి పట్టణానికి చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం బ్రిడ్జిని తాకుతూ ఏలేరు కాలువ ప్రవహించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

తుపాను రాకముందు బ్రిడ్జి గోతులమయం కావడంతో వాహనాలు పాడైపోతున్నాయి. ఎప్పుడైనా ప్రమాదం జరిగినట్టయితే సుమారుగా 40 అడుగుల లోతులోకి మునిగిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

## కళామందిరం నిర్మాణానికి శంకుస్థాపన


గొబ్బూరులో కళా మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు దాడి రత్నాకర్

కశింకోట : మండలంలోని గొబ్బూరులో రూ.65 లక్షల ప్రజల విరాళాలతో గౌరీ కల్యాణ కళా మందిర నిర్మాణానికి గురువారం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ శంకుస్థాపన చేశారు. అభయాంజనేయ గౌరీ సంఘం ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోశ్చరణల నడుమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వినాయకుడు, పరదేశమ్మ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సంఘం అధ్యక్షుడు మళ్ల సూర్యప్రకాశరావు, కార్యదర్శి బుద్ద మల్లికార్జునరావు(శ్రీను), సర్పంచ్ మళ్ల మణి, గోపి, ఎంపీటీసీ మాజీ సభ్యులు సూర్యారావు, దొరబాబు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కృషి


ఏనుగుతునిలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్నప్పటి వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్

కశింకోట : తుపాను వర్షాలకు నష్టపోయిన వరి, చెరకు రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ భరోసా ఇచ్చారు. మండలంలోని ఏనుగుతుని, నూతలగుంటపాలెం, తీడ, చెరకాం, గొబ్బూరు గ్రామాల్లో నీట మునిగిన వరి, చెరకు పంటలను గురువారం పరిశీలించారు. నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఏనుగుతునిలో 250 ఎకరాలో వరి, 150 ఎకరాల్లో చెరకు పంట దెబ్బతిందన్నారు. ఈ విషయమై ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ రామారావుతో ఫోన్‌లో మాట్లాడి పంట నష్టపోయిన రైతులందరి వివరాలు నమోదు చేసి వారికి పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఏనుగుతునిలో దెబ్బతిన్న సాగునీటి కాలువ రెగ్యులేటర్ గేట్లను పరిశీలించి దీని మరమ్మతులు చేపట్టడానికి, పంట కాలువల్లో పూడికలు తీయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తీడ ఎంపీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ దేముళ్లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు దొరబాబు, దాడి కృష్ణ, స్థానిక నాయకుడు అందె రమణ పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే సీఎం ధ్యేయం


తీడ సచివాలయంలో సంక్షేమ బోర్డు ఆవిష్కరించిన ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి తమ మద్దతు అందించాలని ఎంపీపీ కలగా లక్ష్మి కోరారు. తీడ సచివాలయంలో గురువారం సాయంత్రం అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయానికి రూ.20 లక్షల వంతున గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు సమకూరుస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల హృదయాలను చూరగొన్నారన్నారు. వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ గున్నయ్యనాయుడు, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు అప్పలనాయుడు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి కంప్యూటర్ వితరణ

పాయకరావుపేట : డెక్కన్ ఫైన్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు లక్ష రూపాయలు విలువ గల కంప్యూటర్‌ను పాయకరావుపేట శాఖా గ్రంథాలయానికి గురువారం బహూకరించారు. వారికి గ్రంథాలయ ఇన్‌ఛార్జి అధికారి వామాల శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. డెక్కన్ కంపెనీ ప్రతినిధి వెంకటపతిరాజును ఈ సందర్భంగా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోట నగేష్ శాలువాతో సత్కరించారు. కేశవరం మాజీ సర్పంచ్ మేడిశెట్టి శ్రీను, సీతారామమూర్తి, జోగారావు పాల్గొన్నారు.

## ఉప్పు ద్రావణంతో పంట నష్టానికి చెక్

ఎస్.రాయవరం: నీటమునిగిన పంట పొలాల్లో మెలకువలు పాటిస్తే తడిసిన పంటను కొంతవరకు కాపాడుకోవచ్చని వ్యవసాయశాఖ జేడీ మోహనరావు అన్నారు. పి.ధర్మవరం, వాకపాడు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. నీరు తగ్గిన పొలాల్లో చేనును నిలబెట్టుకుని, ఉప్పు ద్రావణం పిచికారి చేస్తే కొంతరకు నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు.

## వెదురువాడలో 'వై ఏపీ నీడ్స్' జగన్


వెదురువాడలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని వెదురువాడలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు దేశంశెట్టి శంకరరావు, కోన లచ్చన్నాయుడు, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, రాజాన విజయ్, శ్రీనివాస్ రాజు, అల్లం లక్ష్మి,లాలం వాసు, గొర్లె నూకరాజు, రమేశ్‌బాబు, లక్ష్మి,గంగూలీ శ్రీను, సీర శ్రీను, పుర్రె సన్యాసిరావు, రామజోగి,రాజాన రాజు,పాము లలిత పాల్గొన్నారు.